

# బాధ్యత

పొత్తూరి విజయలక్ష్మి

**బుజ్జిగాడు బడికెళ్లటానికి సిద్ధమే! కానీ వెళ్లాలనే లేదు!! అయితే ఎందుకు సిద్ధమైనట్టు? వాళ్లమ్మే వాణ్ణి సిద్ధం చేసింది!**

'ఇవ్వాళ బడికి వెళ్లను' అంటూ, వాడు రోజూ ఏడుస్తాడు.

'వాడికదే అలవాటు' అనుకుంటూ, తన ధోరణిలో తానుండిపోతుంది పద్మావతి — వాడి తల్లి!

ఒకవేళ బుజ్జి, వెళ్లనని మరీ మొండికేసి ఏడిస్తే, రెండంటించి, 'వెళ్లి తీరాల్సిందే'నని పద్మావతి మరీ బలవంతపెట్టేస్తుంది.

పిల్లలు మరీ అలా మొండికేస్తే, పెద్దలు లొంగకూడదు; లొంగి ముద్దుచేస్తే, వాళ్లు నెత్తికెక్కుతారని ఆమె నమ్మకం!

అంతేకానీ — 'బుజ్జీ! ఎందుకురా బడికి వెళ్లనని మారాం చేస్తున్నావు? చెప్పు బాబూ. నీకు బళ్లో బాగోలేదా నాన్నా?' అని అనునయంగా, ఆప్యాయంగా ఒక్కనాడూ అడిగిన పాపానపోలేదు.

'నువ్వు బళ్లో ఏం నేర్చుకుంటున్నావమ్మా!' అని గోముగా అడగనన్నా అడగదు.

తెల్లవారితే ఆదరాబాదరా తాను లేచి, నిద్రపోతున్న పసివాణ్ణి తట్టి తట్టి మరీ లేపుతుంది. బుజ్జిగాడి కది కొట్టినట్టుంటుంది! ఏడుస్తూ లేస్తాడు.

పూర్తిగా మెలకువ తెచ్చుకుని, బద్ధకం తీర్చుకుని, మొహం కడుక్కుని వచ్చేలోగా, 'త్వరగా లే, త్వరగా మొహం కడుగూ!' అని ఓ డజను సార్లన్నా అరుస్తుంది పద్మావతి. నాడలాగే ఏడుస్తూ మొహం కడుక్కొస్తాడు. ఓ గ్లాసు పాలలో పంచదార కలిపి వాడి ముందు పెడుతుందా తల్లి. బుజ్జికి ఆ పాలు ఓ పట్టాన మింగుడు పడదు. అందునా, స్నానం, ఆ తర్వాత యూనిఫారం వేసుకుని, బూట్లు తొడుక్కుని, ఏదో కాస్త తిన్నానని తిని, బడికి బయలుదేరే 'క్లైమాక్స్' ఘట్టానికి యీ పాలు తాగటం నాందిగా నిలుస్తుందేమో — వాడికంతసేపూ గరళం మింగినట్టుంటుంది! అమ్మ కోసం అష్టకష్టాలు పడి, ఆ పాలంతా తాగేసినా, వాడి కళ్లు నిండివుంటాయి గానీ, బొజ్జ నిండినట్టుండదు!

బుజ్జిగాడికి బడికి వెళ్లాలంటె ఏడుపు! ఆ దుఃఖం ఏదో భయం నుంచి పుట్టుకొచ్చిందని ఎవరికీ తెలియదు. ఆ భయమేమిటో? ఎందుకో? తెలుసుకోవాలని పద్మావతికిగాని, బుజ్జిగాడి తండ్రి 'ఏడుకొండల' వెంకటేశ్వరరావుకిగాని వుండదు. బడెగ్గొట్టానికి వాడేదో నాటకమాడుతున్నాడని, వాడి ఏడుపుని నిర్లక్ష్యం చేసేస్తారు.

కీలకమైన ఓ నట్టు వదులైతే, దాన్ని కనిపెట్టి బిగించేవరకూ ఒక యంత్రం పనిచేయట మెలా మానేస్తుందో — యిదీ అంతే!

ఆ నట్టులాంటి యీ తల్లితండ్రులు కాస్త మెలకువ తెచ్చుకుంటె, బుజ్జిగాడు ఓ యంత్రంలా రోజూ బడికి పరుగెత్తేవాడేమో!

ఆ పరికరమేదో వీళ్ల ముందరకు వచ్చే వరకూ యింతేమరి! బుజ్జిలాంటి పసివాళ్లకు మోక్షముండదు! కళ్లనీళ్లు నింపుకుని, దిగులుగా నిలబడ్డ కొడుకుని యిటు తిప్పి, అటు తిప్పి తయారుచేసి, బలవంతంగానైనా సరే బడికి తోలేయటమే తన బాధ్యత అని పద్మావతి అనుకుంటె,

'ఒరేయ్ బుజ్జిగా! బాగా చదువుకోవాలిరా!' అని వారాని కొకమాటు గద్దించటం తన బాధ్యత అనుకుంటాడు వెం. రావు!

బుజ్జిగాడు మొదటిసారిగా తన 'ప్రోగ్రెస్ కార్డ్' తీసుకొచ్చి, తల్లికిచ్చాడు. పాపం! వాడికది, తన జాతకం లాంటిదని తెలియదు. 'మీ అమ్మ దగ్గరో, నాన్న దగ్గరో సంతకం చేయించుకు రండి' అని టీచరిస్తే, దాన్ని సంచీలోపెట్టి మోసుకొచ్చాడు. అంతే!

బుజ్జిగాడి మార్కులను తేరిపార చూసిన పద్మావతి చివరకు గుడ్లు తేలేసింది — 'యివేం మార్కులురా?' అని. బుజ్జి తనకేం పట్టనట్టుండిపోయాడు.

'మొద్దు వెధవా! అన్నింటిలోనూ నాలుగూ, ఐదు మార్కులా. ఇందుకా నేను పొద్దున్నే లేచి రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాను? నువ్వేదో పెద్ద చదువు చదివి, మమ్మల్నుద్ధరిస్తావని అనుకుంటుంటె, యిదా నువ్వు వెలగబెట్టేది? ఈ ఒకటో క్లాసులోనే యిలా అయితే, యింక పైపైన ఏం చదువుతావురా?' బాగా మనసు నొచ్చుకుని, బుజ్జిగాడి వీపుమీద ఒక్కటి పెట్టింది పద్మావతి. అమ్మ ఎందుకు కొట్టిందో అర్థం కాక యేడ్చాడు — బుజ్జి.

'చూడండి. మీ సుపుత్రుడి మార్కులు' అంటూ, భర్తకు కుడిచేత్తో ప్రోగ్రెస్ కార్డిస్తూ, ఎడంచేత్తో ముక్కు చీదేసింది.

బుజ్జికి భయమేసింది. ఇందాక అమ్మ 'పెట్టిందే' యింకా నొప్పి తగ్గలేదు. ఇప్పుడు నాన్నేం చేస్తాడో? స్కూల్లో కెళితే టీచరూ యిలాగే కొడుతుంది. ఇంత లావు బెత్తం తీసుకుని, చిన్నపిల్లలనైనా చూడకుండా, గట్టిగా కొట్టేస్తుంది. దెబ్బలంటె తనకు మహా భయం! అవును మరి, దెబ్బలు తిన్నవారికేకదా ఆ నొప్పి తెలిసేది. దెబ్బలు తినటానికి కారణమైన చదువంటె అసలే భయం. చదువుకోటానికి వెళ్లే స్కూలంటె అందుకే భయం. ఎలా తప్పించుకోవాలి? — బుజ్జిగాడి పసిమనసులో ఆలోచనలివే.

'బుజ్జీ'—వెం. రావు కేక పిడుగు పడ్డట్టైంది.

తలుపుచాటున నక్కివున్న బుజ్జిగాడి పాదాల క్రింద నేల తడిసిపోయింది!

వెం. రావు తానే లేచి, వాడి దగ్గరకు వచ్చాడు. 'ఏం చేస్తాడో నాన్న' భయంగా, రెప్ప వేయకుండా చూస్తూ నిలుచున్నాడు బుజ్జి.

వెం. రావు, బుజ్జి చెవి పట్టి, మెలిపెట్టి, "సరిగా చదువుకోటంలేదా? ఎందుకింత తక్కువ మార్కులొచ్చాయి?" ముందంతా ఏమీ పట్టించుకోని తండ్రి, యిప్పుడు మార్కుల దగ్గర

పట్టుకోటం, బుజ్జి మనసులో తెలియని అక్కసు లేపింది.

'నాకు చదువొద్దు' అన్నాడు తలవంచుకుని.

ఆ మాట పూర్తి కాగానే, వాడి చెంప చెళ్లుమంది.

బుజ్జిగాడికి దుఃఖం యిక ఆగలేదు. పెద్దగా ఏడ్వడం మొదలెట్టేశాడు.

మళ్లీ చెయ్యెత్తబోయిన భర్తను ఆపింది

# బాధ్యత

పద్మావతి.

'వెధవ ! మొద్దు వెధవ! బుర్రలేని వెధవ. వీడి ఒకటో క్లాసుకి అంతంత జీతాలు, అన్ని పుస్తకాలు, డ్రస్సులు, బూట్లు, సాక్సులు అని అంతంత డబ్బు తగలేస్తుంటె, వీడు చేసే నిర్వాకం యిదా ? ఇంటి పనులు చేయించు వెధవచేత.'

ఆ ఖర్చులకు పసివాడు కారణం కాదని తెలిసినా, వివక్షణ లేకుండా తిట్టాడు. వాడికి అంత తక్కువ మార్కులు రావటానికి కారణమేమిటని ఆలోచించకుండా తిట్టాడు. తన తప్పేమిటో తెలుసుకోకుండా, కొడుకుమీద ఆగ్రహం చూపించాడు — వెం.రావు.

తండ్రి అంటున్న మాటలు తు.చ తప్పకుండా విన్నాడు బుజ్జిగాడు.




MCA-TT-50 Tel R

'స్కూల్లో టీచరు చెప్పేది నా కర్థం కావటం లేదు. ఇంట్లో నాకు తెలియంది నువ్వు చెప్పవు, అమ్మా చెప్పదు. 'రాదు' అంటె మాత్రం అందరూ ఏకమై నన్ను కొడతారు. దెబ్బలు తింటె నా మనసు పాడై పోతుంది. అసలు మీరు చెప్పినది చేయాలనిపించదు. 'మొద్దు మొద్దు' అని అదే పనిగా అంటుంటె, నాకు చదువు రాదేమోనని భయమేస్తుంది. అలాంటప్పుడు నేను చదువుకునే దెలా? నాకు రానిది అర్థమయ్యేట్లు ఎవరు చెప్తారు? చెపితే, నేనూ చక్కగా చదువుకునే వాణ్ణే. ఇప్పుడు స్కూలొక నరకంలాగ, మీరందరూ రాక్షసుల్లాగ వున్నారు నాకు.' అనే భావంతో, భాష కందని ఆవేశంతో, బుజ్జిగాడి మనసు తండ్రికి జవాబుగా కొట్టుకోసాగింది.

ఆ మాటలు వాడి నోటి ద్వారానే రావాలంటె, వాడింకా ఎదగాలి!

రోజులు గడుస్తున్నాయి. బుజ్జిగాడి దిన చర్యలో మార్పులేదు.

పంపుదగ్గర నీళ్ళు పట్టుకుంటూ పద్మావతి, పక్కవాటా పంకజం గుసగుస లాడుతున్నారు.

'వదినగారూ, దగ్గర హాల్లో మంచి సినిమా ఆడుతూందిట. వెళ్దామా?'

'నిజంగానా? అయితే ఎప్పుడువెళ్దామంటారు?'

'ఎప్పుడేమిటి? యివ్వాళే.'

'సరే అయితే, యివ్వాళ మా బుజ్జికి మధ్యాహ్నం అన్నం డబ్బాలోపెట్టి పంపేస్తాను. ఈలోగా సినిమా చూసొచ్చేయొచ్చు!'

'అదే పద్ధతి మరి, అయితే యివాళ ఖాయమే కదా!'

'ఖాయమే.'

బిందెనిండా నీళ్ళు, మనసు నిండా సంతోషంతో ఎవరి వాటాలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

బుజ్జిగాడికి అన్నం డబ్బా యిస్తూ, 'బుజ్జీ! యీ రోజు మధ్యాహ్నం యింటికి రాకమ్మా. అక్కడే తినేసి ఆడుకో. నీళ్ళు బళ్ళో వున్నాయిగా!' అంది.

బుజ్జిగాడు పసిగట్టేశాడు. ఇలాగే, యిదివరకు రెండుసార్లు చేసింది అమ్మ. తాను మాత్రం సినిమా చూసొచ్చింది. కానీ, యివాళ తనకూ సినిమా మీద మనసు పోయింది.

'అమ్మా, నేనూ నీతో సినిమా కొస్తానే' అన్నాడు.

నీరసపడిపోయింది పద్మావతి. 'నేను సినిమా కెళ్తున్నానని ఎవరు చెప్పారు. డాక్టరు దగ్గరికెళ్ళి మందు తెచ్చుకోవాలి. అందుకని...'

అవసరానికి అలా అబద్ధం చెప్పొచ్చు కాబోలన్న కిటుకు తెలుసుకున్నాడు బుజ్జి.

'అమ్మా! నాకు కడుపులో నొప్పిగా వుంది. నేను బడికి వెళ్ళను.'

'అయ్యో బాబోయ్. బడికి వెళ్ళకపోతే ఎలారా? కడుపునొప్పికి మందు వేస్తా రా. చిటికెలో తగ్గిపోతుంది.' నోట్లో ఏదో వేసి, నీరు పోసింది. ఇంకా అలా కూర్చున్న కొడుకుని గురించి, భర్తతో ఏదో చెప్పింది కాబోలు, 'బుజ్జీ! నిన్నివ్వాళ స్కూలుకి సైకిలుమీద దింపుతా రా' అని పిల్చాడు వెం. రావు సైకిలు పట్టుకుని.

అమ్మా, నాన్నా కలసి, తనని యింట్లోంచి బయటికి నెట్టే ప్రయత్నమే చేస్తున్నారనిపించింది బుజ్జికి. విధిలేక సైకిలెక్కాడు.

క్లాసులో టీచరు ఏవో రెండు ప్రశ్నలు వేస్తే జవాబు చెప్పలేదు. ఏదో చెబితే అన్నీ తప్పులే వ్రాశాడు. టీచరుకు కోపం వచ్చి, అరిచేతిమీద పేంబెత్తంతో నాలుగు దెబ్బలు వేసింది. బుజ్జి చేయి చూసుకుంటూ ఏడ్చాడు. బాధతో ఏడ్చాడు. అమ్మ తనని వదిలి సినిమాకి వెళ్తుందన్న సంగతి మర్చిపోలేక ఏడ్చాడు. అందువల్ల, మధ్యాహ్నం భోజనం చేయాలనిపించలేదు. సంచినుంచి అన్నం డబ్బాను బయటికి తీయనేలేదు. పంపు దగ్గరకెళ్ళి నీళ్ళు తాగి వచ్చాడు. కాసేపటికి, ఏదో నీరసంగా అయి, జ్వరం వచ్చినట్టు ఒళ్ళంతా వేడెక్కిపోయింది. క్లాసు రూం కొచ్చి పడుకున్నాడు. అలాగే నిద్ర పట్టేసింది. కాసేపటికి బెల్లైంది కాబోలు, నిద్రపోతున్న బుజ్జిని, బలవంతంగా లేపి కూర్చోబెట్టింది టీచరు. అలా సగం నిద్రలో లేచి కూర్చోగానే, ఆకలేసినట్టై, ఏడుపు లంకించాడు.

'ఏడుస్తే కొడతాను జాగ్రత్త' అని టీచరు బెత్తం ఝళిపించింది. 'ఈ టీచర్లు అన్నిటికీ కొట్టటమే!' ఏడుపు మింగి వుసుక్కున్నాడు బుజ్జి.

బోలెడు హోం వర్క్ యిచ్చి, రాసుకోమన్నారు. 'ఇంటికి రాగానే కూడ పుస్తకాలతో తల బాదుకోవాలి' ఆ పుస్తకాలన్నీ కలిసి, తనని బంధించి, వూపిరాడ కుండా చేస్తున్నట్టనిపించింది బుజ్జికి.

'నాన్నలాగ తానూ త్వరగా పెద్దవాడైపోతే, యింక స్కూలుకి రావటం మానేయొచ్చు. ఆ రోజు లెప్పుడొస్తాయో' అన్నట్టుగా బెంగపడిపోయాడు.

సాయంత్రం, అమ్మ వచ్చేవరకూ పక్కింట్లో వున్నాడు.

ఐదు దాటిన తర్వాత పద్మావతి వచ్చింది. మ్యాట్నీ చూసొచ్చిన నీరసం, ఆమెలో కొట్టొచ్చినట్టు కనబడుతూంది.

తలుపు తీసి, తల్లీ కొడుకు ఇద్దరూ లోపలి కెళ్ళారు. 'అమ్మా, ఆకలే!' అన్నాడు బుజ్జి యింట్లోకి రాగానే.

'అబ్బబ్బ వుండరా. అప్పలాళ్ళలాగ మీది కొస్తున్నావు. నేను కనబడగానే ఆకలొచ్చింది. ఏం అన్నం తినలేదూ?'

'తినలేదు.'

'ఎందుకూ?'

'టీచరు కొట్టారు.

పించలేదు.'

'ఏం! చెప్పింది చదువుకు వెళ్ళలేదా? లేక ఏమన్నా వెధవపని చేశావా? టీచరుమీద అలిగి అన్నం మానేస్తే, ఆకలూరుకుంటుందా? ఇప్పుడు తిను, ఆ అన్నాన్ని' అంది కోపంగా.

డబ్బా తెరిచాడు బుజ్జి. మజ్జిగంతా పీల్చేసి, మెతుకులు బిరుసుగా వున్నాయి. ఏదో వాసన కూడ! ఆ అన్నం బుజ్జిగాడికి సయించలేదు. పక్కన పెట్టేశాడు.

తలనొప్పిగా వుందని పద్మావతి కాఫీ చేసుకుంటూంది.

'అమ్మా! నేనూ కాఫీ తాగుతా'నన్నాడు.

'ఏదో ఒకటి ఏడు' అంటూ, వాడికీ ఓ గ్లాసులో కాఫీ యిచ్చింది.

రాత్రికి వంట మొదలెట్టింది

'అమ్మా! యీ లెక్క చెప్పవూ.' అంటూ వచ్చాడు బుజ్జి.

'అబ్బబ్బ వుండరా! అసలే తలనొప్పితో ఛస్తున్నాను. పైగా యీ వంటొకటి' అంటూ విసుక్కుంది.

బుజ్జికి రేపటి సంగతి గుర్తుకొచ్చి, దుఃఖం పొంగింది. మాట్లాడకుండా అవతలకు పోయాడు. వాడి క్లాసులో చంద్ర, రాణి, భాస్కర్, నవీన్ – వీళ్ళు వాడి కంటి ముందు నిలిచారు. వీళ్ళందరూ టీచరు ఏ ప్రశ్న వేసినా, జవాబు చెప్తారు. హోంవర్కంతా చేసుకొస్తారు. 'మా



ఆమధ్య అమెరికాలో తెనుగువారు డెట్రాయిట్‌లో వేసిన నాటకం 'వింతమనుషులు'లో పాల్గొన్న వారు. కూర్చున్నవారు(ఎడమనుంచి) శ్రీయుతులు జె. వి. రావు, జి. గాంధీ, వి. ఆర్. వడ్లమూడి, టి. ఆర్. కె. రెడ్డి, కుమారి సుమ, (నిలబడినవారు) శ్రీయుతులు ఈశ్వరరావు, వేణు, చోడేపూడి సుభద్ర, అయిగారి విజయలక్ష్మి, జి. సత్యనారాయణ, శశిధర్, స్వరూప, బంగారు, శ్రీమతి రెడ్డి.

అమ్మ నాకు రానివన్నీ నేర్పుతుంది' అంటుంది చంద్ర.

రాణికి కూడ అంతేట. భాస్కర్‌కి వాళ్ల తాతగారు లెక్కలు నేర్పుతారుట. నవీన్‌కు వాళ్ల నాన్నగారు చెప్తారుట. మరి తనకో? తాతగారు లేకపోయినా, అమ్మా, నాన్నా వున్నారుగా! ఎప్పుడడిగినా అమ్మ యిప్పుడు కాదంటుంది. సినిమాలకి వెళ్తుంది, పుస్తకాలు చదువుతుంది, పక్కింటి 'ఆంటీ'తో మాట్లాడుతుంది. తనకు పాఠాలు చెప్పమంటె విసుక్కుంటుంది. నాన్న యింట్లో వుంటమే తక్కువ. ఉన్నప్పుడు. 'ఎందుకు సరిగా చదూకోటంలే'దని చెవులు మెలేస్తాడు. టీచరు ఒకసారి చెబితే అర్థం కాదు. (ఇంకోసారి అడగాలని తెలీదు!) తనకెవరు రానివి నేర్పుతారు? కొట్టటానికి మాత్రం అందరూ సిద్ధం! ఇక దెబ్బలు భరించే ఓపికలేదు. ఎక్కడికన్నా పారిపోవాలి.

'ఇవ్వాళ అమ్మ హోంవర్క్‌లో సాయం చేయక పోతే అంతే యింక.'

వేయకుండా బడికెళితే టీచరు చచ్చేట్టు కొడుతుంది. బడికి వెళ్లకపోతే అమ్మ మెడపట్టి నెడుతుంది. ఇంట్లోంచి బయటపడి, యింకెక్కడికో వెళ్లిపోవాలి. ఇలాంటి ఆలోచనలు వాడి బుర్రలో తిరుగుతున్నాయి. వాడి మూగబాధకు మాటలు వ్రాయాలంటె అవే మరి! ఆ రోజు పద్మావతిగానీ, వెం. రావుగానీ బుజ్జికి ఏమీ చెప్పలేదు. అది తమ బాధ్యత అన్న ఆలోచనకు వాళ్లు చోటివ్వలేదు.

మర్నాడు... ...

## చిత్రం!

పుస్తకాన్ని చూడు
పుస్తకమే కనిపిస్తుంది

కలాన్ని చూడు
కలమే కనిపిస్తుంది

బొమ్మని చూడు
బొమ్మే కనిపిస్తుంది

దేన్నైనా చూడు
అదే కనిపిస్తుంది

కానీ

అద్దాన్ని చూడు
నువ్వే కనిపిస్తావ్!

— కొప్పర్తి వేంకటరమణమూర్తి

## బాధ్యత

బడినుంచి ఎంతకీ యింటికి రాని బుజ్జి కోసం వెతకసాగింది పద్మావతి. తర్వాత బడికెళ్లింది. అక్కడా లేడు. ఆమెలో కంపన మేర్పడింది. క్లాసు టీచరింటికి వెళ్లింది. 'అసలివ్వాళ మీ బుజ్జి బడికే రాలేదండి' అందామె.

'ఆఁ' పద్మావతికి గుండెలో దిగులు పేరుకుంది దుఃఖం రాసాగింది.

'అయితే బుజ్జి ఏమైపోయాడు? పొద్దుట నుంచీ యిప్పటిదాక ఎక్కడ వున్నాడు? బుజ్జీ ఎక్కడున్నావురా?' అని ఏడ్చేసింది పద్మావతి.

చుట్టుపక్కలవాళ్లు పోలీసు రిపోర్టిచ్చి, వెం. రావుకి ఫోన్ చేశారు.

అతను వెంటనే బయలుదేరి వచ్చేశాడు జరిగింది వినేసరికి, అతని నవనాడులూ కృంగి పోయాయి. బుజ్జి కోసం పత్రికా ప్రకటనలు రేడియో ప్రకటన, మైక్ అనౌన్స్‌మెంట్లు — ఎన్నో చేశారు. వారం రోజులు గడిచాయి. బుజ్జి జాడలేదు ఏమైపోయాడో? ఎవరి చేతికి చిక్కాడో? ఎలా మారుతాడో? ఆ తల్లితండ్రుల్ని పిచ్చివాళ్లని చేసేసింది సంఘటన.

ఇప్పుడనిపిస్తూంది — వాళ్లు తమ బాధ్యతని సరిగా గుర్తించలేదేమోనని.

తమ బిడ్డని తమకు దక్కించమని మొక్కని మొక్కుల్లేవు. ఎంతమంది వచ్చినాగానీ, ఒక్క బుజ్జి వస్తేనే ఆ దంపతులు కోలుకోగలరు. మరి బుజ్జి ఎప్పటికి కనిపిస్తాడో?

మీ కెవరికన్నా, బుజ్జిబాబు కనిపిస్తే మాత్రం, ఆ తల్లితండ్రులకు చేర్పించే బాధ్యత మీది సుమా! పాపం! బిడ్డలకన్న తల్లితండ్రులిలాట దుఃఖసాగరంలో మునిగిపోకూడదు కదా!



గవర్నమెంట్ సోప్ ఫ్యాక్టరీ, బెంగుళూరు వారి విశిష్ట ఉత్పత్తి మార్కెట్ చేయువారు ® మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు. MCA-MSS 61 Te